1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 73 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 16 మార్చి 2026 పేజీలు 8 : వెల 3/–ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 73 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Monday 16 March 2026 PAGES : 8 PRICE : 3/-

## కేంద్రం పరిశీలనలో విశాఖ మెట్రో ప్రాజెక్టు మంత్రి నారాయణ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 15)
విశాఖ నగరాభివృద్ధికి హడ్కో సహకారం కీలకమని మంత్రి నారాయణ అన్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఆదాయ మార్గాలను అన్వేషిస్తామన్నారు. విశాఖ మెట్రో ప్రాజెక్టును కేంద్రం పరిశీలిస్తోందని చెప్పారు. విశాఖ మెట్రోను 'రైడర్స్' సంస్థ అధ్యయనం చేస్తోందని, రెండు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. ▶మిగతా 2లో

## రాహుల్ గాంధీకి అది కూడా తెలియదా?: అమిత్ షా




(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 15)
భాజపా, ప్రధాని మోదీని వ్యతిరేకించే క్రమంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. దేశాన్ని అపఖ్యాతి పాలు చేసేందుకు యత్నిస్తున్నారని కేంద్రమంత్రి అమిత్ షా ఆరోపించారు. ఆయన చర్యలకు ఏ భారతీయుడూ మద్దతు ఇవ్వడని పేర్కొన్నారు. అస్సాం పర్యటనలో భాగంగా వైద్యారోగ్య రంగంలో రూ.2 వేల కోట్లకుపైగా విలువైన ప్రాజెక్టులకు కేంద్రమంత్రి ఆదివారం ▶మిగతా 2లో

## కష్టాన్ని మీ గుమ్మం తాకనివ్వం

ప్రజల కోసం పనిచేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
గత ప్రభుత్వంలో నిధులొచ్చినా పట్టించుకోలేదు
'అడవితల్లి బాట'లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
గిరిజనుల నడుమ జనసేన ఆవిర్భావ వేడుకలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 15)
'మీరు ఓట్లు వేశారా లేదా అన్నది చూడలేదు. పార్టీ చూడలేదు. మీ అందరినీ మా అన్నదమ్ములు, ఆడపడుచులుగా చూశాం. మీరు బాగుండాలి. సమస్యలతో మీరు ఇబ్బంది పడకూడదు. మీకోసం పని చేయడానికి, మీ కష్టాలు తీర్చడానికే కూటమి ప్రభుత్వం ఉంది' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం ఓనూరు, నందిగరువు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. అడవితల్లి బాట పేరుతో ఓనూరు – నందిగరువు గ్రామానికి వేసిన రోడ్డు, జలజీవన్ మిషన్‌లో భాగంగా వేసిన తాగునీటి కుళాయిలను మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. రోడ్డు లేక డోలీమోతలతో నందిగరువు గిరిజనులు పడుతున్న అవస్థలకు విముక్తి కల్పించిన సందర్భంగా వారి మధ్య జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడానికి వచ్చానన్నారు.
ఓనూరు కూడలిలో జనసేన పార్టీ జెండా ఆవిష్కరించారు. నందిగరువులో 'మన ఊరు – మాటామంతీ' నిర్వహించి, గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. 'మన్యంలో కేంద్ర సహకారంతో రోడ్లు వేయగలుగుతున్నాం. గత ప్రభుత్వంలోనూ ఈ నిధులున్నాయి. వాటిని ఏం చేశారని మీరే వారిని నిలదీయాలి. కూటమి ప్రభుత్వం ఈ నిధులను మళ్లించకుండా పీవీటీజీ, గిరిజన గ్రామాలకు రోడ్లు వేస్తోంది. కూటమి హయాంలో మన్యంలో 460 కి.మీ.పైగా రోడ్లు వేశాం. జలజీవన్ మిషన్‌కు కేంద్రం గత ప్రభుత్వంలో నిధులు కేటాయిస్తే వైకాపా

# కాంగ్రెస్ భయాందోళనలు సృష్టిస్తోంది



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 15)
ప్రపంచ యుద్ధాల ప్రభావం ప్రజలపై అతి తక్కువగా పడేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుండగా.. కాంగ్రెస్ పార్టీ బాధ్యతా రహితంగా వ్యవహరిస్తూ భయాందోళనల సృష్టికి ప్రయత్నిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో శనివారం ప్రధాని పర్యటించారు. పశ్చిమ బెంగాల్‌లో రూ.18,680 కోట్ల విలువైన రవాణా, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను.. అస్సాంలో రెండు రోజుల్లో కలిపి మొత్తం రూ.47,800 కోట్ల ప్రాజెక్టులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాల్లో ర్యాలీలను ఉద్దేశించి ప్రసంగించిన మోదీ అస్సాంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌ను, పశ్చిమ బెంగాల్‌లో అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శించారు. అస్సాంలోని సిల్చర్‌లో ప్రాజెక్టుల ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతూ.. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందన్నారు. "దేశానికి సంబంధించి, అస్సాం గురించి కాంగ్రెస్‌కు ఎలాంటి దార్శనికత లేదు. మోదీని ఎలా తిట్టాలి, పుకార్లు.. అబద్ధాలు ఎలా వ్యాప్తి చేయాలి, ప్రజల్ని తప్పుదోవ పట్టించే రీళ్లు ఎలా చేయాలో మాత్రమే వారికి తెలుసు" అని దుయ్యబట్టారు. ఏఐ సదస్సులో కాంగ్రెస్ నిర్వాకాన్ని దేశమంతా విమర్శించినా, 'రాజ కుటుంబం' మాత్రం ఆందోళనకారుల వెన్ను తట్టిందన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పదేళ్లపాటు అస్సాంకు ప్రాతినిధ్యం వహించినా రాష్ట్ర రైతులకు ఒక్కపైసా ఇవ్వలేదని, భాజపా రూ.20 వేల కోట్ల కంటే ఎక్కువ మొత్తాన్ని అందించిందన్నారు.

### బెంగాల్ ఆటవిక పాలకులకు కౌంట్‌డౌన్

రాష్ట్ర పర్యటనకు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును అవమానించడం ద్వారా పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ హద్దులన్నిటినీ మీరిపోయిందని ప్రధానమంత్రి మండిపడ్డారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో మెగా ర్యాలీని ఉద్దేశించి ప్రసంగిస్తూ... రాష్ట్రపతికి ఆహ్వానం పలికేందుకు ముఖ్యమంత్రి గానీ, కనీసం రాష్ట్ర మంత్రి గానీ వెళ్లకుండా టీఎంసీ దేశంలోని గిరిజనులను, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అవమానించిందని అన్నారు. రాష్ట్రంలోని తృణమూల్ పాలనలో అట్టడుగు వర్గాలు వేధింపులకు గురవుతున్నాయని తెలిపారు. చొరబాటుదారుల ఓటుబ్యాంకును కాపాడుకునేందుకే ఓటరు జాబితాల సవరణకు తెచ్చిన 'సర్' ప్రక్రియను వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. బెంగాల్‌కు ఆటవిక పాలన తెచ్చినవారికి కౌంట్‌డౌన్ మొదలైందని, దురాగతాలకు పాల్పడిన టీఎంసీ నాయకులను వదిలిపెట్టబోమని మోదీ హెచ్చరించారు.

గాయపడిన పోలీసు అధికారిని ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

### భాజపా, టీఎంసీ కార్యకర్తల ఘర్షణ

ప్రధాని కోల్‌కతా ర్యాలీకి అరగంట ముందు మధ్య కోల్‌కతా ప్రాంతంలో భాజపా, టీఎంసీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాలూ రాళ్లు రువ్వుకోవడంతో పోలీసు అధికారితోపాటు ఒక భాజపా నాయకుడు గాయపడ్డారు. ప్రధాని ర్యాలీకి పార్టీ మద్దతుదారులను చేరవేస్తున్న తమ వాహనాలు టీఎంసీ దాడిలో ధ్వంసమయ్యాయని భాజపా తెలిపింది. ఈ ఆరోపణను ఖండించిన టీఎంసీ.. భాజపా గూండాలు మంత్రి శశి పాంజా ఇంటిపై రాళ్లు రువ్వి ఉద్రిక్త పరిస్థితి సృష్టించారని ఆరోపించింది.

## ఇస్ఫహాన్‌పై భారీ దాడులు..



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,మార్చి 15)
ఇరాన్‌కు చెందిన అత్యంత కీలకమైన అణు కేంద్రం ఉన్న ఇస్ఫహాన్ నగరంపై అమెరికా–ఇజ్రాయెల్ విమానాలు విరుచుకుపడుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి నగరంలోని వివిధ ప్రదేశాల్లో భారీ పేలుళ్లు వినిపించినట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. చాలా చోట్ల భారీ ఎత్తున నల్లని పొగ ఆకాశాన్ని కమ్మేసింది. అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు చాలా తక్కువ ఎత్తులో ఎగురుతూ ఈ దాడులు చేసినట్లు చెబుతున్నారు.

### స్పేస్ రీసెర్చ్ సెంటర్‌పై దాడి..

పశ్చిమ టెహ్రాన్‌లోని ఇరాన్ స్పేస్ రీసెర్చ్ సెంటర్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దళాలు దాడులు చేశాయి. ఇరాన్ తనకు అవసరమైన శాటిలైట్ ఇంటెలిజెన్స్ మ్యాపింగ్ సమాచారాన్ని ఇక్కడి నుంచే సేకరిస్తుంది.

### భారీ బాంబర్‌ను పంపిన సెంట్రల్ కమాండ్..

ఇరాన్‌పై దాడులకు అమెరికా తన వద్ద ఉన్న బి–52 బాంబర్ విమానాన్ని పంపినట్లు తెలుస్తోంది. ఇది దాదాపు 38 టన్నుల బాంబులను తీసుకెళ్లగలదు. దీనికి సంబంధించిన వీడియోను సెంట్రల్ కమాండ్ ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఆదివారం ఉదయం దాదాపు 20 నిమిషాల వ్యవధిలోనే 20 భారీ పేలుళ్లు వినిపించినట్లు స్థానికులు వెల్లడించారు. ముఖ్యంగా నగరంలోని ఎయిర్‌పోర్టు వద్ద ఇవి చోటు చేసుకున్నట్లు చెబుతున్నారు.

## డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన పుట్టా మహేశ్‌కు ఎంపీగా ఉండే అర్హత లేదు: కాకాణి గోవర్ధన్ రెడ్డి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 15)
డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్‌కు పదవిలో కొనసాగే నైతిక అర్హత లేదని వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. పుట్టా మహేశ్‌ను రక్షించడానికి స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే రంగంలోకి దిగారని, డ్రగ్స్ మాఫియాను ఆయనే పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. సామాన్యుడికి ఒక రూల్, ప్రజాప్రతినిధికి మరో రూల్ ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ శివారు మొయినాబాద్‌లోని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో జరిగిన వీకెండ్ పార్టీలో డ్రగ్స్ కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ పార్టీలో పుట్టా మహేశ్ డ్రగ్స్ తీసుకున్నట్లు ఈగిల్ ఫోర్స్ పోలీసులు అధికారికంగా ప్రకటించారు. ఈ ఘటన ఏపీ రాజకీయాల్లో పెద్ద దుమారం రేపింది. ▶మిగతా 2లో

## ఎండల తీవ్రతపై 'అవేర్'



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 15)
ఈ ఏడాది వేసవిలో ఉష్ణోగ్రతలు బాగా పెరిగే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. వేసవి కార్యాచరణ ప్రణాళిక– 2026పై కీలక శాఖలను సన్నద్ధం చేసింది. వేసవిలో సమర్థ సేవలు అందించేందుకు 'అవేర్' వ్యవస్థ సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని వైద్యారోగ్య శాఖ నిర్ణయించింది. వాతావరణ శాఖ ద్వారా అందే సమాచారం ▶మిగతా 2లో

# డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన ఏలూరు ఎంపీ... టీడీపీపై షర్మిల ఫైర్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 15)
ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ వ్యవహారంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీలో టీడీపీ ఎంపీ పట్టుబడటం సిగ్గుచేటని విమర్శించారు. అతడిపై తక్షణమే అనర్హత వేటు వేయాలని, తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా షర్మిల సోషల్ మీడియాలో స్పందిస్తూ... "ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతుంటే, ఇక్కడ ఎంపీ కొకైన్‌తో విందు, చిందులు చేయడం దారుణం. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ఇంత బాధ్యతారహితంగా వ్యవహరిస్తారా? డ్రగ్స్ టెస్టులో పాజిటివ్ వచ్చింది కదా, ఇప్పుడు చంద్రబాబు ఏం చర్యలు తీసుకుంటారు?" అని ప్రశ్నించారు. డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడిన ఎంపీ సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని, యువతను డ్రగ్స్ వాడమని ప్రోత్సహిస్తున్నారా? అని షర్మిల నిలదీశారు. ఓట్లు వేసి గెలిపించిన ఏలూరు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ఆమె ప్రశ్నించారు. డ్రగ్స్‌పై నిజంగానే కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలనుకుంటే, ముందుగా తమ సొంత పార్టీ ఎంపీపై చర్యలు తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని షర్మిల సవాల్ విసిరారు.

## గుత్తేదార్ల కోసమే 'ఉపాధి'లో మార్పు: షర్మిల



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 15)
దేశవ్యాప్తంగా ఉపాధి హామీ పథకానికి వెచ్చించే రూ.80 వేల కోట్లను గుత్తేదార్లకు దోచిపెట్టాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. అందుకోసమే ఉపాధి పథకాన్ని మార్పు చేసి, పేదలకు నష్టం కలిగిస్తోందన్నారు. దీన్ని వ్యతిరేకించకుండా ▶మిగతా 2లో

# కదిరి బాబురావుని కలిసిన హనుమంతునిపాడు మండల నాయకులు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మార్చి 15)

కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావుని హనుమంతునిపాడు మండల నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హనుమంతునిపాడు మండలంలోని కొత్తూరు గ్రామంలో మార్చి 30వ తేదిన జరిగే శ్రీరామనవమి వేడుకలకు హాజరువ్వాలని కదిరి బాబురావుని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మువ్వా శివ యాదవ్, మందాటి శ్రీవాసరెడ్డి, పప్పుల శ్రీరాములు, అలవల వెంకటరెడ్డి, సూరిశెట్టి నారాయణ స్వామి, కండే శ్రీనివాసులు, కీసరి మధు, నరేంద్ర, తదితరులు కలిశారు.

# అగ్రహారంలో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మార్చి 15)

మండలంలోని కే అగ్రహారం గ్రామంలో నేషనల్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఆదివారం కందులు కొనుగోల కేంద్రం ప్రారంభించారు. వ్యవసాయ అధికారి వి రాము మాట్లాడుతూ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కందులు కింటాకు రూ. 8,000లు చొప్పున కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండవ ప్రసాద్, పిఎసిఎస్ అధ్యక్షుడు ఉన్నం కొండలరావు, బి నారాయణరెడ్డి, రమణయ్య, బాలకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# కేంద్రం పరిశీలనలో విశాఖ మెట్రో ప్రాజెక్టు మంత్రి నారాయణ

హైదరాబాద్ ఓఆర్‌ఆర్‌లా విశాఖకు సెమీ రింగ్‌రోడ్డు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. రాంబిల్లి-భోగాపురం ప్రాజెక్టును వీఎంఆర్‌డీయే పరిశీలిస్తోందన్నారు. మాస్టర్‌ప్లాన్ రోడ్డులో ఒక రోడ్డుకు అటవీ భూమి అడ్డంకిగా ఉందని, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, తాను మాట్లాడి సమస్యను పరిష్కరించామని నారాయణ తెలిపారు.

# రాహుల్ గాంధీకి అది కూడా తెలియదా?: అమిత్ షా

ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ గత పాలనపై విమర్శలు చేశారు.“అస్సాంలో కాంగ్రెస్ తన 15 ఏళ్ల పాలనలో వైద్యారోగ్య రంగానికి సంబంధించిన బడ్జెట్ నుంచి ఏటా రూ.150 కోట్లు కాజేసింది. ఆ సమయంలో ఆరోగ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఆ పార్టీ కేవలం తమ నేతల కుటుంబాల ఆర్థిక ప్రయోజనాల కోసమే పనిచేసింది” అని అమిత్ షా (ూఎఫ్ ూష్టుష్ట) ఆరోపించారు. సమాజంలోని అన్ని వర్గాలకూ అందుబాటు ధరల్లో వైద్య సేవలు లభించేలా భాజపా కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలోని వైద్య సదుపాయాలను గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల స్థాయికి తీర్చిదిద్దారని సీఎం హిమంత బిశ్వశర్మను అభినందించారు.

**అసెంబ్లీ ఎన్నికలు.. నేడు షెడ్యూల్ విడుదల!**

ఇటీవల దిల్లీలో ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి నిరసన చేపట్టిన వ్యవహారంపై అమిత్ షా మండిపడ్డారు. అదేవిధంగా పార్లమెంట్ మెట్లపై నిలబడి రాహుల్ గాంధీ చాయ్, పకోడీలు తీసుకోవడాన్ని కూడా ఖండించారు. పార్లమెంట్ అనేది ప్రజాస్వామ్యానికి పవిత్ర ప్రదేశమని, అల్పాహారం ఎక్కడ తీసుకోవాలో కూడా ఆయనకు తెలియదా? అని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా.. త్వరలో ఎన్నికలు జరగనున్న అస్సాంలో అమిత్ షా పర్యటించడం నాలుగు నెలల్లో ఇది నాల్గోసారి.

# కష్టాన్ని మీ గుమ్మం తాకనివ్వం

ప్రభుత్వం తీసుకోలేదు. కేవలం పైపులైన్లు వేసి వదిలేశారు. కూటమి ప్రభుత్వం ఆ నిధులతో ఇంటింటికీ తాగునీరు అందిస్తోంది’ అని పవన్ కల్యాణ్ తెలిపారు.

**అండగా ఉంటే నిలబడి సమస్యలు తీరుస్తాం**

జనసేన పార్టీ పెట్టి 12 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ.. ‘పార్టీ పెట్టిన తర్వాత ఎంత దూరం ప్రయాణిస్తాం, ఏం అవుతామని ఆలోచించలేదు. గిరిజన ప్రాంతాల్లో సదుపాయాలు కల్పిస్తున్నందుకు ఈరోజు చాలా తృప్తిగా, సంతోషంగా ఉంది. మీరంతా మద్దతుగా ఉంటే గిరిజన ప్రాంతాలను మరింతగా అభివృద్ధి చేస్తాం. మీకు అండగా ఉంటాం. వచ్చే ఎన్నికల్లో కూటమిని దిగ్విజయంగా గెలిపించండి. సమస్యలను ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో సమీక్షించి పరిష్కారమయ్యేలా చేస్తాం’ అని పవన్ అన్నారు.

ఓనూరు- నందిగరువు కొత్త రోడ్డుపై ప్రధాని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రాలతో కూడిన ప్లకార్డులు **పట్టుకున్న చిన్నారులతో పవన్ కల్యాణ్**

**ఉపముఖ్యమంత్రికి ఘన స్వాగతం**

నందిగరువు గ్రామానికి 3 కి.మీ.ముందు గిరిజనులు థింసా నృత్యాలతో పవన్ కల్యాణ్‌కు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఓనూరు మీదుగా నందిగరువు వరకు సుమారు 3 కి.మీ. నడుచుకుంటూ వెళ్లారు. మార్గమధ్యలో మహిళల నుంచి వినతులు స్వీకరించారు. తీయగడ్డ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఓనూరులో గిరిజన మహిళలతో కలిసి జలజీవన్ మిషన్ పథకాన్ని ప్రారంభించారు. ప్రకృతి అందాలను వీక్షించి, పర్యాటక వ్యూ పాయింట్లుగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ శివశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన పుట్టా మహేశ్‌కు ఎంపీగా ఉండే అర్హత లేదు: కాకాణి గోవర్ధన్ రెడ్డి

ఈ నేపథ్యంలో కాకాణి మాట్లాడుతూ, “చంద్రబాబు బ్రాండ్ అంటేనే డ్రగ్స్ బ్రాండ్” అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనతో వైసీపీ నేతలు టీడీపీని ‘డ్రగ్స్ పార్టీ’గా అభివర్ణిస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రస్తుతం ఈ డ్రగ్స్ కేసుపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ఇదే ఫామ్‌హౌస్‌లో కాల్పులు జరిపిన వ్యక్తిని కూడా అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం పుట్టా మహేశ్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.


# ఎండల తీవ్రతపై ‘అవేర్’

ఆధారంగా ఎండ తీవ్రతపై నాలుగైదు రోజుల ముందే సమాచారమిచ్చి ఆయా ప్రాంతాల ప్రజలను కలెక్టర్లు, వైద్యులు, సిబ్బంది ద్వారా అప్రమత్తం చేయనుంది. ఈ మేరకు వేసవి కార్యాచరణ ప్రణాళిక, సన్నద్ధతపై వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించి ఆదేశాలు జారీచేశారు.

# గుత్తేదార్ల కోసమే ‘ఉపాధి’లో మార్పు: షర్మిల

సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వైకాపా అధ్యక్షుడు జగన్ భాజపాకు బానిసలుగా మారిపోయారని ఆరోపించారు. ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా శనివారం ఆమె అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం వెదుళ్లపాలెం చేరుకున్నారు. అక్కడ కూలీలతో కలిసి ఉపాధి పనిలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిలో నేడు అమరజీవి విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సీఎం చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మార్చి 15)

ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు (మార్చి 16) అమరావతి, విజయవాడ నగరాల్లో రెండు కీలక కార్యక్రమాల్లో పాల్గొంటారు. తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని అమరావతిలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం, పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా విజయవాడలో ప్రభుత్వం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులో పాల్గొంటారు.వివరాల్లోకి వెళితే, సోమవారం ఉదయం 11:15 గంటలకు అమరావతిలోని శాఖమూరు పార్కు వద్ద ఏర్పాటు చేసిన 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరిస్తారు. తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ పొట్టి శ్రీరాములు 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన విషయం తెలిసిందే. ఆయన త్యాగానికి ప్రతీకగా 58 అడుగుల ఎత్తుతో ఈ విగ్రహాన్ని తీర్చిదిద్దారు. రూ.150 కోట్ల అంచనా వ్యయంతో 6.80 ఎకరాల విస్తీర్ణంలో తలపెట్టిన పొట్టి శ్రీరాములు స్మృతివనం ప్రాజెక్టులో భాగంగా మొదటి దశ పనులు పూర్తయ్యాయి.

పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ కేవలం ఆరు నెలల రికార్డు సమయంలో ఈ భారీ విగ్రహ నిర్మాణాన్ని పూర్తి చేసింది. ఈ విగ్రహం తయారీకి 26 టన్నుల కాంస్యం, 42 టన్నుల ఐరన్ స్ట్రక్చర్‌ను వినియోగించారు. ప్రాజెక్టులో భాగంగా రెండో దశలో ఇక్కడ ఒక మ్యూజియం, ఫోటో గ్యాలరీ, ఆడిటోరియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వంటివి నిర్మించనున్నారు. ఈ కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడకు బయలుదేరి వెళతారు.సాయంత్రం 5:40 గంటలకు విజయవాడలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ముస్లిం మైనారిటీ సోదరులకు శుభాకాంక్షలు తెలిపి, వారితో కలిసి ఆయన ఇఫ్తార్ స్వీకరిస్తారు.

# వైభవంగా అన్నమయ్య 523వ ఆరాధనోత్సవం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 15)

తొలి తెలుగు వాగ్గేయకారుడు ద్రవిడా హరి సంకీర్తనాచార్యుడు శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుడు 523వ వర్ధంతి కార్యక్రమం శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యసంగీత సాహిత్య సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో కొలువై ఉన్న అన్నమయ్య విగ్రహ సన్నిధిలో ఫాల్గుణ బహుళ ద్వాదశి సందర్భంగా 523వ వర్ధంతి కార్యక్రమంను వైభవముగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు ఐ మురళీకృష్ణ మాట్లాడుతూ తెలుగు పాటకు ప్రాణం పోసి అపార భక్తి ప్రపత్తులతో శ్రీ వెంకటేశ్వరుని 32వేల సంకీర్తనలతో సేవించి తరించిన వాగ్గేయకార శిరోమణి అన్నమయ్య అని పేర్కొన్నారు. విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తూనుగుంట మల్లిఖార్జునరావు మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనలు తెలుగు జాతికి పెన్నిధి అని పేర్కొన్నారు. ప్రరసం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనలు లోకానికి భక్తినీ చాటిన మంత్ర రాజాలు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగాభక్తులు విరివిగా పాల్గొని స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. తదనంతరం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సామూహికగానంలో గాయని, గాయకులు కె త్రిపుర ఆకుల శ్రీనివాసరావు బి బదరీ శ్రీ రంగనాథం, పి జానకిరామ్, గుర్రం కృష్ణ, తదితరులు అదివో అల్లాదివో చక్కని తల్లికి కొండలలో నెలకొన్న వంటి కీర్తనలు సుమధురంగా ఆలపించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసాదరావు ట్రాక్ స్టార్ అధ్యక్షుడు మామూర్తి ఓవిఎస్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలను సమితి ఉపాధ్యక్షురాలు కె త్రిపుర, సెక్రటరీ వాకా కోటిరెడ్డి పర్యవేక్షించారు.

# సినిమా అంటే నాకు ప్రాణం... అందుకే దాన్ని ఎప్పటికీ వదల్లేను: పవన్ కల్యాణ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 15)



“నాకు తెలిసిన, నేను చూసిన హీరో ఒక్కరే.. అది అన్నయ్య చిరంజీవి గారే” అంటూ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. తన అన్నయ్యే తనకు స్ఫూర్తి అని పునరుద్ఘాటించారు. ‘ఉస్తాద్ భగత్ సింగ్’ చిత్ర గ్లింప్స్‌ను చూసి అభినందిస్తూ చిరంజీవి, రామ్ చరణ్ చేసిన ట్వీట్లకు ఆయన మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో అంగరంగ వైభవంగా జరిగిన చిత్ర ప్రీ-రిలీజ్ వేడుకలో పవన్ ప్రసంగించారు.“ఉస్తాద్ భగత్ సింగ్’ ప్రీ రిలీజ్ వేడుకకు వచ్చిన, నా గుండెల్లో స్థానం ఉన్న మీ అందరికీ, టీవీలో ఈ కార్యక్రమాన్ని చూస్తున్న తెలుగు ప్రజలందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు. ఈ వేడుకకు మీ ఆశీస్సులు అందించడానికి వచ్చినందుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.ఇందాక సుమా గారు మాట్లాడుతూ నన్ను గతకాలం నాటి హీరో అన్నట్టు మాట్లాడారు. ఈ మధ్యనే ‘ఓజీ’ వచ్చిందనే విషయాన్ని మీరు మర్చిపోయినట్టున్నారు. నేను రెగ్యులర్‌గా సినిమాలు చేయకపోవడం వల్ల నన్ను ఇలా వెనక్కి నెట్టడం భావ్యం కాదని బల్లగుద్ది మరీ చెబుతున్నాను. సరదాగా అంటున్నాను కానీ, సినిమా అంటే నాకు ప్రాణం. నాకు అన్నం పెట్టింది సినిమా. ఈ రోజు ప్రజలకు సేవ చేసే గుర్తింపును ఇచ్చింది కూడా సినిమానే. అందుకే సినిమాను వదల్లేను. నా నిర్మాతలు, దర్శకులు, రచయితలు బాగుండాలని కోరుకుంటాను. సినిమా కలెక్షన్ల గురించి నేను ఎప్పుడూ పట్టించుకోలేదు. నేను తెలుగు సినిమా, తమిళ సినిమా అని చూడను, భారతీయ చిత్ర పరిశ్రమగానే భావిస్తాను.నా హీరో అంటే ఒకే ఒక్కరు... మెగాస్టార్ చిరంజీవి గారు. అలాంటి అన్నయ్య, ఈ రోజు ‘ఉస్తాద్ భగత్ సింగ్’ ట్రైలర్ చూసి ట్వీట్ చేసినందుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. అలాగే రామ్ చరణ్, ‘పెద్ది’ దర్శకులు బుచ్చిబాబు గారికి కూడా ధన్యవాదాలు.ఒక సినిమాను మొదలుపెట్టేటప్పుడు అద్భుతంగా రావాలనే అందరం కోరుకుంటాం. కానీ ఆ తర్వాత ఎన్నో అడ్డంకులు, ఒడిదొడుకులు ఎదురవుతాయి. వాటన్నింటినీ దాటుకుని విజయం సాధించడం చాలా కష్టం. నేను ఒకసారి దర్శకుడిని నమ్మితే, గుడ్డిగా నమ్మేస్తాను. ఏం చేయమంటే అది చేస్తాను. హరీశ్ శంకర్ మొదట ఒక కథ చెప్పారు, కానీ అది ముందుకు వెళ్లలేదు. ఆ తర్వాత కథ మారింది, మధ్యలో కొవిడ్ వచ్చింది, నేను రాజకీయాల్లోకి వెళ్లాను. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక, నా విధులకు ఇబ్బంది కలగకుండా పక్కా ప్రణాళికతో ఈ సినిమా చేశాం. రాత్రింబవళ్లు కూర్చుని కేవలం 40-45 రోజుల్లోనే మేజర్ పార్ట్ షూటింగ్ పూర్తి చేశాను. నిజంగా పక్కా ప్లానింగ్ ఉంటే, రాజకీయ బాధ్యతలు నిర్వర్తిస్తూనే సినిమాలు చేయొచ్చని ఈ సినిమా నాకు భరోసా ఇచ్చింది. ఆ ఘనత దర్శకుడు హరీష్ శంకర్‌దే.





ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ **వెలుగు**

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

16.03.26 సోమవారం


# కనిగిరి వైసీపీలో రచ్చ...రచ్చ...!

### దద్దాల, బుర్రా లు కౌన్సిలర్లకు సన్మానాలు
### పోటా పోటీగా సన్మాన కార్యక్రమాలు
### తలలుపట్టుకుంటున్న వైసీపీ శ్రేణులు
### కనిగిరి కొండపై రఫా...రఫా వైసీపీ జండా ఎగరేయాలి



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మార్చి 15)**

కనిగిరి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో రచ్చ నడుస్తుంది. గ్రూపుల పోరుతో పార్టీ ప్రజల్లో రోజు రోజుకు పలుచనవుతోంది. కనిగిరి మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ కందుకూరు వైసీపీ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నప్పటికీ కనిగిరి పై కన్నేసి ఉన్నారు. కందుకూరులో కష్టమని అనుకున్నాడేమో కాని పార్టీకి భారీగా ఫండ్ ముట్టజెప్పి కనిగిరి వైసీపీ సీటును దక్కించుకుంటానని ఆయన అనుచరులకు భరోసా ఇస్తున్నారు. కానీ కనిగిరి వైసీపీ శ్రేణులు మాత్రం ఇదేంటంటూ తలలుపట్టుకుంటున్నారు. వైసీపీ టిక్కెట్ తమ నాయకుడికే అంటూ ఎవరికి వారే ప్రచారం చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ నెల 18న మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్ల పదవీ కాలం ముగియనుంది. దాంతో కౌన్సిలర్లకు 10 రోజుల క్రితం వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ తన నివాసంలో ఛైర్మన్, కౌన్సిలర్లకు పార్టీ నాయకులతో కలిసి సన్మానం చేసి విందు ఏర్పాటు చేసారు. అయితే అందుకు పోటీగా మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ కనిగిరిలోని తన నివాసంలో గురువారం కొంత మంది కౌన్సిలర్లకు సన్మాన కార్యక్రమం జరిపారు. మాజీ ఎమ్మెల్యే బుర్రా ముఖ్య అనుచరుడు కౌన్సిలర్లకు ఫోన్ చేసి బుర్రా నివాసానికి రావాలని కోరారు. కానీ మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్‌తో పాటు కొందరు కౌన్సిలర్లు బుర్రా నివాసానికి వెళ్ళలేదు. 20 మంది కౌన్సిలర్లకు గాను 6 గురు మాత్రమే బుర్రా నివాసంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బుర్రా జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాలని, కనిగిరి కొండ పై వైసీపీ జండా రఫా...రఫా ఎగురవేయాలని వైసీపీ కౌన్సిలర్లను ఉత్తేజపరిచారు. కానీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్‌కు, బుర్రాకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కనిగిరి కొండ పై వైసీపీ జండా ఎగరాలని బుర్రా చెప్పడంలోని ఆంతర్యం ఏమిటో అనే చర్చ కనిగిరిలో జోరుగా సాగుతుంది. వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల వర్గం మాత్రం బుర్రా కనిగిరి వైసీపీలో రచ్చ చేస్తున్నాడని, ఈ విషయాన్ని పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తామంటున్నారు. కనిగిరిలో వైసీపీ ఓడిపోవడానికి కారణం బుర్రానేనని దద్దాల వర్గం బహిరంగంగా విమర్శిస్తుంది. కందుకూరులో పార్టీని బలోపేతం చేయాల్సిన బుర్రా కనిగిరి వైసీపీ శ్రేణుల్లో గందరగోళం కల్పిస్తూ పార్టీని బలహీన పరుస్తున్నారని దద్దాల వర్గం దుమ్మెత్తిపోస్తున్నారు. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు అనుచరులు మాత్రం తమ నాయకునికి కనిగిరి టిక్కెట్ ఖాయమని, స్థానిక ఎన్నికల తర్వాత ఇన్‌ఛార్జిగా ప్రకటిస్తారని ప్రచారం చేస్తున్నారు. కనిగిరి నియోజకవర్గంలో బలమైన సామాజిక వర్గానికి చెందిన రెడ్డి కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి అనుచరులు మాత్రం పులివెందుల తర్వాత రెడ్డి సామాజికవర్గం అధికంగా ఉన్న నియోజకవర్గం కనిగిరి అని, ఇప్పటికే మూడు పర్యాయాలు యాదవ సామాజిక వర్గానికి అధినేత అవకాశం కల్పించారని 2029లో రెడ్డి సామాజిక వర్గానికే వైసీపీ టిక్కెట్ కేటాయిస్తారని గట్టి ధీమాతో ఉన్నారు. కాని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, రెడ్డి కార్పొరేషన్ ఛైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డిలు మాత్రం కనిగిరి నియోజకవర్గంలో పార్టీ, ప్రయివేటు కార్యక్రమాలకు హాజరవుతూ టిక్కెట్ ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. కానీ మాజీ ఎమ్మెల్యే బుర్రా, వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల మాత్రం ఒకరి పై ఒకరు విమర్శలు గుప్పించుకుంటూ పార్టీ శ్రేణుల్లో అలజడులు సృష్టిస్తున్నారు. పార్టీ అధిష్టానం కనిగిరిలోని వైసీపీ వర్గపోరుకు చెక్ పెట్టకపోతే పార్టీ మరింత నష్టపోయే పరిస్థితులు ఉన్నాయని పార్టీ వీరాభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## అనధికారికంగా నిల్వ ఉన్న 94 గ్యాస్ సిలిండర్‌లు సీజ్





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 15)**

అనధికారికంగా నిల్వ ఉన్న గ్యాస్ సిలిండర్ల సమాచారం ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ కొల్లి శ్రీనివాసరావుకి అందజేశారు. రాబడిన సమాచారం మేరకు ఒంగోలు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్మెంట్ సీఐ రాఘవరావు, నాగేశ్వరావు, పొదిలి సివిల్ సప్లైస్ డిటి డేవిడ్, సిబ్బందితో కలిసి మండలంలో దాడులు నిర్వహించారు. మండలంలోని వేలూరు గ్రామం నందు చిన్నపురెడ్డి వెంకటేశ్వర్లు అక్రమంగా డోమెస్టిక్ సిలిండర్స్ నుండి కమర్షియల్ సిలిండర్‌లకు మోటార్‌ల ద్వారా గ్యాస్ నింపి నిల్వ వుంచి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఇతని గోడౌన్ నందు 46 డోమాస్టిక్, 27 కమర్షియల్ సిలిండర్లు సీజ్ చేశారు. ఇదే గ్రామంలో ధర్మవరపు బలరామిరెడ్డి అక్రమంగా డొమెస్టిక్ సిలిండర్స్ నుండి కమర్షియల్ సిలిండర్‌లకు మోటార్‌ల ద్వారా గ్యాస్ నింపి నిల్వవుంచి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఇతని వద్ద 9 డొమెస్టిక్, 12 కమర్షియల్ సిలిండర్లు గుర్తించి సీజ్ చేశారు. ఎటువంటి లైసెన్స్, అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వవుంచి, గ్యాస్ ను రీఫిల్లింగ్ చేస్తూ ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అంతట ఎటువంటి అనుమతులు, లైసెన్స్ లేకుండా వున్న వివిధ రకాల కంపెనీ డొమెస్టిక్ అండ్ కమర్షియల్ సిలిండర్‌లను సీజ్ చేసి కరుణ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ పొదిలి వారికి అప్పగించారు. (తరువాయి 4లో...)

## పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మార్చి 15)**

ప్రకాశం, మార్కాపురం జిల్లా కలెక్టర్ పి రాజబాబు నేటి నుంచి పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా సాంఘిక సంక్షేమ, బి.సి, గిరిజన, అన్ని సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నేటి నుంచి ప్రారంభం కానున్న ఈ పరీక్షలు మీ జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టమన్నారు. మీరు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, విద్యార్థుల సౌలభ్యం కోసం పలు సూచనలు చేశారు.

**పరీక్షా సమయంలో విద్యార్థులు పాటించవలసిన ముఖ్య సూత్రాలు :**

పరీక్షకు ముందు రోజు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా మానసికంగా ప్రశాంతంగా ఉండాలి. సరైన నిద్ర, ఆహారం అవసరం. పరీక్షా కేంద్రానికి కనీసం అరగంట ముందుగానే చేరుకోవాలి. దీనివల్ల అనవసరపు హడావిడి తప్పుతుంది. మీకు ఇచ్చిన ఓఎంఆర్ షీట్‌ను క్షుణ్ణంగా పరిశీలించండి. రూమ్ నంబర్, సబ్జెక్టు కోడ్, ఆన్సర్ బుక్ నంబర్లను సరిగా నమోదు చేయాలి. మీ సంతకం, ఇన్విజిలేటర్ సంతకం ఉండేలా చూసుకోవాలి. ప్రశ్నపత్రాన్ని అందిన వెంటనే ఒకటికి రెండుసార్లు పూర్తిగా చదవండి. ప్రశ్నను సరిగ్గా అర్థం చేసుకున్న తర్వాతే సమాధానం రాయడం ప్రారంభించండి. మీకు బాగా వచ్చిన సమాధానాలను మొదట రాయండి. కొట్టివేతలు లేకుండా, స్పష్టంగా అందమైన అక్షరాలతో (ముత్యాల్లాంటి రాతతో) పాయింట్ల వారీగా రాస్తే మార్కులు మెరుగ్గా వస్తాయి. (తరువాయి 4లో...)

## పలు దేవాలయాలను సందర్శించిన మంత్రి డాక్టర్ స్వామి

### కుటుంబ సమేతంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మార్చి 15)**

తిరుపతి, కాణిపాకం, శ్రీకాళహస్తి, తిరుచానూరు దేవాలయాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం 4

## వైభవోపేతంగా గుంటక సుబ్బారెడ్డి కుమార్తె రిసెప్షన్ వేడుక

### ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల హాజరు
### నవ దంపతులను ఆశీర్వదించిన ప్రముఖులు

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మార్చి 15)**

మార్కాపురం మాజీ ఏఎంసి ఛైర్మన్ గుంటక సుబ్బారెడ్డి కుమార్తె నాగ సింధూర రెడ్డి, నిషిత్‌రెడ్డిల రిసెప్షన్ వేడుక ఆదివారం స్థానిక సౌజన్య ఫంక్షన్ హాలులో వైభవోపేతంగా జరిగింది. ఈ వేడుకకు ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, 4



## సాంబన్న కృషితో కారంచేడుకు మహర్దశ

- కారంచేడు గ్రామానికి రూ.1.10 కోట్ల అభివృద్ధి పనులు
- సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ప్రాధాన్యం
- అంతర్గత రహదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం
- వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలకు చెక్
- వేగంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే ఏలూరి కృషి పై గ్రామస్తుల హర్షం

**(షణ్ముఖ వెలుగు, కారంచేడు, మార్చి 15)**





పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు (సాంబన్న) కృషితో కారంచేడు గ్రామం అభివృద్ధి బాటలో ముందుకు సాగుతోంది. గ్రామంలో మౌలిక వసతుల మెరుగుదలకు పెద్దపీట వేస్తూ రూ.1.10 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు చేపట్టి వేగంగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని అంతర్గత రహదారులు, డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేకంగా దృష్టి సారించడంతో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ప్రస్తుతం గ్రామంలోని పలు ప్రధాన వీధులతో పాటు అంతర్గత గల్లీల్లో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైన్ల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. (తరువాయి 4లో...)

# వైభవోపేతంగా గుంటక సుబ్బారెడ్డి కుమార్తె రిసెప్షన్ వేడుక




ఉగ్ర నరసింహారెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు కెపి కొండారెడ్డి, అన్నా వెంకట రాంబాబు, కరణం బలరామకృష్ణమూర్తి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్, మాజీ ఏఎంసి ఛైర్మన్ షంషీర్ ఆలీ బేగ్, ఆర్యవైశ్య నాయకులు మేడా బద్రీనాథ్, అన్నా కృష్ణ చైతన్య, శాసనాల వీరబ్రహ్మం, షణ్ముఖ వెలుగు దినపత్రిక ఎడిటర్ ఓబులశెట్టి రాధాకృష్ణ, ఇంకా పలువురు రాజకీయ ప్రముఖులు, వైద్యులు, కూటమి నాయకులు, వైసీపీ నాయకులు, బంధుమిత్రులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# పలు దేవాలయాలను సందర్శించిన మంత్రి డాక్టర్ స్వామి

సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశీస్సులు, ఆశీర్వాదంతో ఎన్డీఏ ప్రభుత్వ పాలన సుదీర్ఘకాలం కొనసాగాలని, దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచేలా చూడాలని భగవంతుని మంత్రి స్వామి ప్రార్థించారు.




## సాంబన్న కృషితో కారంచేడుకు మహర్దశ

ఈ పనులు పూర్తయితే గ్రామంలో రాకపోకలు మరింత సులభమవడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే నీటి నిల్వలు, మురుగు సమస్యలు గణనీయంగా తగ్గనున్నాయని గ్రామస్తులు భావిస్తున్నారు. గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ఎమ్మెల్యే ఏలూరి కృషి చేస్తున్నారని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.


## అనధికారికంగా నిల్వ ఉన్న 94 గ్యాస్ సిలిండర్‌లు సీజ్

మోటార్‌లను వెయింగ్ మెషిన్‌లను స్వాధీన పర్చుకున్నారు. సిలిండర్‌లను అక్రమ నిల్వ ఉంచి రీఫిల్లింగ్ చేస్తున్నందున ఇరువురి పైన తగు చర్యల నిమత్తం పొదిలి పోలీస్ స్టేషన్ నందు క్రిమినల్ కేసులు, మార్కాపురం జేసీ కోర్ట్ నందు 6(ఏ) కేసు నమోదు చేయుటకు నిర్దారించారని విజిల్సె అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

## పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

ప్రతి సమాధానానికి ఖచ్చితమైన ప్రశ్న నంబర్ వేయడం మర్చిపోవద్దు. నంబర్ వేయకపోతే ఆ సమాధానం పరిగణనలోకి రాదని గుర్తుంచుకోండి. ప్రతి విభాగంలో అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయండి. సరిగ్గా తెలియని ప్రశ్నలకు కూడా మీకు తెలిసిన సమాచారాన్ని రాయండి కానీ పేజీని ఖాళీగా వదలవద్దు. ముఖ్యంగా సైన్స్ సబ్జెక్టులో అవసరమైన చోట పెన్సిల్‌తో స్పష్టమైన బొమ్మలు గీసి భాగాలను గుర్తించండి. ఇది మీ స్కోరును పెంచుతుంది. మీరు రాసే ప్రతి పేజీకి నంబర్ వేసి, సమాధాన పత్రాలను క్రమ పద్ధతిలో జత కట్టండి. మేము సరఫరా చేసిన స్టడీ మెటీరియల్‌ను క్షుణ్ణంగా చదవండి. దీనివల్ల సగటు విద్యార్థి కూడా సులభంగా ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, మెరిట్ విద్యార్థులు అత్యుత్తమ స్కోరు సాధించే అవకాశం ఉంటుంది. చివరి నిమిషం వరకు పరీక్షా కేంద్రంలోనే ఉండి, రాసిన సమాధానాలను మరోసారి సరిచూసుకోండి. మా ఆశీస్సులు మీకు ఎల్లప్పుడూ ఉంటాయి. క్రమశిక్షణతో, ఏకాగ్రతతో పరీక్షలు రాసి మన జిల్లాకు పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని కలెక్టర్ తెలిపారు.

## పేదరాలకి ఆర్థిక సహాయం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మార్చి 15)

మండలంలోని చిన్నగంజాం గ్రామనికి చెందిన ఎం నాగలక్ష్మి పేదరికంతో బాధపడుతూ కనీసం వికలాంగ పింఛన్ కూడా రాక ఇబ్బందులు పడుతున్న సందర్భంలో అమె పరిస్థితి తెలుసుకున్న పర్చూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఎన్ జ్యోతి యాదవ్, ఎన్ రామరాజు యాదవ్‌లు నాగలక్ష్మీ ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి బియ్యం, నిత్యావసర వస్తువులు, రూ.5వేల నగదు సహాయం అందజేశారు. అనంతరం సంబంధిత పెన్షన్ అధికారులతో మాట్లాడి నాగలక్ష్మికి తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్నగంజాం మండల కాంగ్రెస్ అధ్యక్షులు పౌల్, పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తేజ, చిన్నగంజాం టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సుభాని, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వయోజనులకు ఉల్లాస్ పరీక్ష



(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, మార్చి 15)

నిరక్షరాస్యులైన వయోజనులకు అక్షరాస్యులుగా మార్చాలనే లక్ష్యంతో జాతీయ సార్వత్రిక విద్యాలయ సంస్థ, జాతీయ సాక్షరాతా మిషన్ అధారిటీ ఆధ్వర్యంలో మండలంలో అన్ని సచివాలయాల పరిధిలో గుర్తించబడిన పరీక్షా కేంద్రాలలో వాలంటరీ టీచర్స్, గ్రామ సంఘం సహాయకులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సహకారంతో 2235కి ఉల్లాస్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి అసెస్ మెంట్ టెస్ట్ ను నిర్వహించినట్లు ఎపిఎమ్ బి అనురాధ అన్నారు. ఈ సందర్భంగా సామాజిక సాధికారతలో భాగంగా ఎపిఎమ్ బి అనురాధ మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా చదువురాని వారందరికీ చదవడం, రాయడం నేర్పించి నైపుణ్యాలను ఈ మేరకు సాధించారో అంచనా వేయడానికి ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి అసెస్ మెంట్ టెస్ట్‌ను నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాలను వయోజన విద్య నోడల్ అధికారి మధుసూదనరావు, పర్యవేక్షకులు కె మనోరంజన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి శ్రీనివాసరావు, ఎపిఎమ్ బి అనురాధ, సీసీలు పి ప్రసన్నాంజనేయరెడ్డి, చిన్ని రాజశేఖర్, దుడ్డు అశోక్ కుమార్ పరిశీలించారు.

## పశు వ్యాధి నియంత్రణ టీకాలు వేయించండి

### ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మార్చి 15)

పశువులకు గాలికుంటు వ్యాధులు సోకకుండా నివారణ టీకాలు వేయించాలని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పశుపోషకులకు సూచించారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువులకు గాలికుంటు నివారణ టీకా కార్యక్రమం గోడ ప్రతులను ఆదివారం తన నివాసంలో చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు వ్యాధి నియంత్రణలో భాగంగా ప్రభుత్వం ఉచితంగా నివారణ టీకాలు వేయించడం జరుగుతుందని, పశు పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వినుకొండ పశు వైద్యశాల పరిధిలో 52,070 తెల్ల, నల్ల పశువులు ఉన్నాయని పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్ శ్రీరాములు వివరించగా ప్రతి పశువుకి గాలికుంటు నియంత్రణ టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పన్ను వసూలు కార్యక్రమం పరిశీలించిన పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 15)

ప్రకాశం జిల్లా పంచాయతీ అధికారి ఎం వెంకటేశ్వరరావు ఆదివారం ఉలవపాడు గ్రామ పంచాయతీ ఎస్టీ కాలనీలో ఇంటి పన్ను వసూలు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆదివారం రోజున ఇంటి పన్నులు రూ.39,158లు వసూలు చేయబడిన అసెస్మెంట్లు- 32) వసూలు చేయడం పై, అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ ప్రతి రోజు టార్గెట్ 3 లక్షలు కావున సహకారంతో వసూలు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన మొత్తం డిమాండ్ రూ.95.76లక్షలు కాగా, ఇప్పటి వరకు రూ.61.21లక్షలు వసూలు చేయబడింది. అనగా 64.38 శాతం మాత్రమే వసూలు చేయబడింది మిగిలిన మార్చి 20వ తేది లోపు కలెక్షన్ చెయ్యవలసిందిగా ఆదేశించారు. గౌరవ కమిషనర్ పంచాయతీ రాజ్, కలెక్టర్ ఆదేశాల మేరకు మార్చి 20 నాటికి ఇంటి పన్నులు 100 శాతం వసూలు కావాలన్నారు. పెండింగ్ బకాయిల వసూళ్ల కోసం ప్రత్యే క బృందాలు 5 ఏర్పా టు చేసిన వారితో ఫీల్డ్ విజిట్ చేయడమైనది. తక్షణ చర్యలు తీసుకొని 100% వసూళ్లు పూర్తి చేయాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఇంటి పన్ను వసూళ్లలో ఎటువంటి నిర్లక్ష్యం, ఆలస్యం లేదా నిర్లిప్తత సహించబడదని, బాధ్యులపై చట్టపరమైన మరియు శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టంగా హెచ్చరించారు. కాబట్టి సంబంధిత సిబ్బంది అందరూ దీనిని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని, రోజు వారి ప్రణాళికతో వసూళ్లు వేగవంతం చేసి, వెంటనే వసూలు చేయవలసిందిగా ఆదేశించినారు, స్వయంగా ఇంటి పన్ను కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించి ఇంటి పన్ను వసూలు చేయించారు. ఈ విషయంలో ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, ఎంజీవోలు ప్రత్యేక దృష్టి పెట్టి, సంబంధిత సిబ్బందితో సమన్వయం చేసుకుని వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. అందరూ ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని పన్నుల వసూళ్లను వేగవంతంగా పూర్తి చేయవలసిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి సురేష్, పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్స్, హౌస్ టాక్స్ కలెక్షన్ టీమ్ మెంబర్స్, తదితరులు పాల్గొన్నారు.

# బహుజన సంఘాల ఆధ్వర్యంలో కాన్షీరామ్ 92వ జయంతి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మార్చి 15)

ప్రముఖ భారత రాజకీయ బహుజన నాయకుడు సామాజిక సంస్కర్త ,బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షీరామ్ 92వ జయంతి కార్యక్రమాన్ని బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం మాచర్ల పట్టణంలోని బిసి నవ చైతన్య వేదిక సంఘ కార్యాలయం నందు ఘనంగా నిర్వహించారు. మొదటిగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు జోహార్ మాన్యశ్రీ కాన్షీరామ్ కొనసాగిస్తాం కాన్షీరామ్ ఆశయాలను అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్, దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాధికారమే అన్ని సమస్యలకు పరిష్కారమని నమ్మిన వ్యక్తి, బహుజనులు స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదగాలని ఆకాంక్షించిన బహుజన నాయకుడు కాన్షీరామ్ అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల కోసం వారిని రాజ్యాధికారం వైపు నడిపించడానికి ఆయన కృషి చేశాడని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని బహుజనులందరూ రాజ్యాధికారం కోసం ఉద్యమించాలన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో కుమారి మాయావతిని నాలుగు సార్లు ముఖ్యమంత్రి చేసిన ఘనత కాన్షిరామ్ కే దక్కుతుందన్నారు. దళిత బహుజన భీమ్సేన రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు జార్జి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కులాలందరినీ ఏకం చేసి చైతన్య పరసి రాజ్యాధికారం వైపు నడిపించిన నాయకుడు కాన్షిరామ్ అని అన్నారు. రోపార్ జిల్లాలో 15 మార్చి 1934 సంవత్సరంలో జన్మించారని 1948 ఏప్రిల్ 14న బహుజన సమాజ్ పార్టీని స్థాపించారన్నారు. ఏపీ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు గురజాల అప్పారావు మాట్లాడుతూ బహుజన సంఘాల నాయకులు అందరూ కలిసి కాన్షిరామ్ జయంతి కార్యక్రమాన్ని జరుపుకోవడం గర్వంగా ఉందన్నారు. బీసీ నవచైతన్య వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు బొడ్డుపల్లి ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రతి బహుజనుడు కాన్షీరాం లాగా నిస్వార్ధంగా పనిచేసి బహుజన రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాముల ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

# వినుకొండలో జీవీ దూకుడు వైసీపీ నుండి టీడీపీలోకి 50 కుటుంబాలు చేరిక



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మార్చి 15)

పల్నాడు జిల్లా వినుకొండ మండలం చీకటిగలపాలెం గ్రామంలో రాజకీయంగా కీలక పరిణామం చోటు చేసుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 50 కుటుంబాలు (దాదాపు 120 మంది సభ్యులు) ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో సూపర్ సిక్స్ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అర్హులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు, పలు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. అలాగే పెన్షన్లు పెంచి ప్రతి నెలా సమయానికి అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వానిదని పేర్కొన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కృషితో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని, రాబోయే ఐదేళ్లలో పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందని జీవీ ఆంజనేయులు హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు పార్టీ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో

# ఘనంగా మాన్యశ్రీ కాన్షిరాం 92 జయంతి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 15)

ప్రకాశం జిల్లా ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు షేక్ అజీజ్ అధ్యక్షతన భారతదేశ బహుజన రాజ్యాధికార పితామహుడు మాన్యశ్రీ కాన్షిరాం 92 జయంతి కార్యక్రమం నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమానికి బహుజన ప్రజా సంఘ బీసీ నాయకులు పాల్గొని మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో కాన్షిరామ్ ఆలోచనతో బహుజన రాజ్యాధికారం బహుజనలంతా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావల సుధాకర్, ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరణికోట లక్ష్మీనారాయణ, ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాటిపర్తి వెంకటస్వామి , ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేరం సత్యం, మాజీ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం, ప్రజా కవి కత్తి కళ్యాణ్, మిరియం శ్రీనివాసరావు, బిఎస్పి పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు మిరియం అంజి బాబు , కలల దండోరా ప్రసాద్, చంద్రశేఖర్, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు తన్నీరు శివప్రసాద్, ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కైలా వెంకట్రావు, బీసీ సమన్వయ కమిటీ ప్రకాశం జిల్లా చైర్మన్ బొట్ల సుబ్బారావు, రెడ్ స్టార్ పార్టీ జిల్లా అధ్యక్షులు భీమవరపు సుబ్బారావు, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు నియోజకవర్గ అధ్యక్షులు శోభన్ బాబు, బీసీ సమన్వయ కమిటీ ప్రకాశం జిల్లా కన్వీనర్ గుంటూరు మస్తాన్‌రావు, సంఘ నాయకులు దూల అప్పారావు, నాగళ్ళ ఆంజనేయులు, మాచవరం ఆంజనేయులు, దళిత సంఘ నాయకులు రాజారావు, తదితరులు పాల్గొని కాన్షిరామ్, ఘనంగా నివాళులర్పిస్తామని తెలిపారు.

# ఉల్లాస్ పరిక్ష నిర్వహణ



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మార్చి 15)

వయోజనులకు సంపూర్ణ అక్షరాస్యతను సాధించేందుకు ఉల్లాస్ కార్యక్రమం తోడ్పడుతుందని ఎపిఎమ్ సుబ్బారావు అన్నారు. మండలంలో వెలుగు డిఅర్డిఏ, డ్రోమ అధికారుల అధ్వర్యంలో జాతీయ సార్వత్రిక విద్యాలయ సంస్థ మరియు జాతీయ సాక్షరాతా మిషన్ అధారిటీ సౌజన్యంతో స్వయం సహాయక సంఘ సభ్యులు, ఉపాధి హామీ సభ్యులు నిర్వహించిన ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి అసెస్ మెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎమ్ సుబ్బారావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమం ఉల్లాస్ పథకం ద్వారా మండలంలోని మొత్తం సచివాలయాల పరిధిలో గుర్తించబడిన పరీక్షా కేంద్రాలలో 3200 మంది అభ్యాసకులు పరీక్ష రాసినట్లు తెలిపారు. మోటుపల్లి, కడవకుదురు ఈ పరీక్షా కేంద్రాలను వయోజన విద్య నోడల్ అధికారి బి మధుసూదనరావు, పర్యవేక్షకులు కె మనోరంజన్, ఎపిఎమ్ సుబ్బారావు పరిశీలించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘ సభ్యులు, ఉపాధి హామీ సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## అగ్ని బాధితులకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ భరోసా





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మార్చి 15)

ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన చీకటిగలపాలెం గ్రామానికి చెందిన రావూరి అనిత, ముప్పరాజువారిపాలెంకు చెందిన షేక్ చిన్నసాంబి కుటుంబాలను ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీ జీవీ ఆంజనేయులు పరామర్శించారు. ప్రభుత్వ చీఫ్ విప్ వారి కార్యాలయంలో బాధితులకు శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం బస్తా, వంట సామాన్లు, బట్టలు మరియు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జీవీ మాట్లాడుతూ:బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా వారికి త్వరలోనే నూతన గృహాలను మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగంపై మున్సిపల్ అధికారుల తనిఖీలు

### పర్యావరణానికి అనుకూల వస్తువులు విక్రయిస్తున్న వ్యాపారికి సన్మానం



(షణ్ముఖ వెలుగు, బద్వేలు, మార్చి 15)

బద్వేల్ పురపాలక సంఘం పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం రైడింగ్, తనిఖీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దుకాణాలను పరిశీలించి ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని అధికారులు పరిశీలించారు. తనిఖీల సందర్భంగా శ్రీనివాసులు అనే వ్యాపారి పర్యావరణానికి హాని కలిగించని బయోడిగ్రేడబుల్ వస్తువులను మాత్రమే విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతగా వ్యవహరిస్తున్నందుకు మున్సిపల్ కమిషనర్ ఆయనను శాలువాతో సన్మానించి అభినందించారు. ఇతర వ్యాపారులు కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ (ఇంచార్జి) రమణయ్య, శానిటరీ సెక్రటరీలు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆపరేషన్ వజ్రప్రహార్‌లో భాగంగా

# పామూరులో కార్డన్ అండ్ సెర్చ్

### మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అవగాహన ర్యాలీ





(షణ్ముఖ వెలుగు, పామూరు, మార్చి 15)

మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పామూరు సీఐ యం శ్రీనివాసరావు, కనిగిరి సీఐ యు శ్రీనివాసులు, 5 మంది సర్కిల్ ఎస్‌ఐలు 36 మంది సిబ్బందితో కలిసి ఆదివారం ఉదయం పామూరులోని గణేష్ నగర్, విరాట్ నగర్, డివి పాలెంలో వజ్ర ప్రహార్ ఆపరేషన్ (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహించారు. తనిఖీల్లో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిల్వ, విక్రయాల పై ప్రత్యేక దృష్టి సారించి ఇళ్లు, దుకాణాలు, అనుమానితుల ఇళ్లు, ఇతర ప్రదేశాలను తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 82 మోటార్ సైకిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కొందరు వాహన యజమానులకు చలానాలు విధించారు. తదనంతరం "డ్రగ్స్ వద్దు బ్రో" అనే నినాదంతో స్థానిక ప్రజలతో కలిసి గంజాయికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. పామూరులోని మమ్మీ డాడీ సెంటర్ వద్ద యువత, వ్యాపారులు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని "గంజాయిని పారదోలుదాం-డ్రగ్స్ నిర్మూలనకు కట్టుబడుదాం" అంటూ ప్రతిజ్ఞ చేశారు. ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, చట్టపరమైన దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు.



గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీసి కుటుంబ వ్యవస్థ పై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. పామూరు సిఐ యం శ్రీనివాసరావు మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణ కోసం చేపట్టిన తనిఖీలు నిర్వహించామన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సరైన మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఒకసారి తప్పు దారిలోకి వెళ్లితే వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబాలు కూడా ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం విద్య, ఉద్యోగ అవకాశాలు, కుటుంబ అభివృద్ధి, ఆరోగ్యం పై ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. నేర నియంత్రణ అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టకి పోలీసుశాఖ నిర్వహించే కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌కి ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. వారి ప్రాంతంలో చట్ట వ్యతిరేక చర్యలు, అసాంఘిక కార్యకలాపాలు అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డైల్112, 100కు తెలియజేయాలని కోరారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972కు డయల్ 112కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ఈ కార్డన్‌సెర్చ్‌లో పామూరు ఎస్‌ఐ అనుక్, హనుమంతునిపాడు ఎస్‌ఐ మాధవరావు, పిసిపల్లి ఎస్‌ఐ కోటయ్య, వెలిగండ్ల ఎస్‌ఐ కృష్ణపావని, పీసిపల్లి ఎస్‌ఐ వెంకటేశ్వర్ల నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపి ఎన్‌జిఓ నూతన కమిటీలు ఏకగ్రీవం







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 15)

ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌పోర్ట్ శాఖ టెక్నికల్ అధికారుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి, ఎపి యన్‌జిఓ అసోసియేషన్ ఒంగోలు పట్టణ అధ్యక్షులు కొత్తపల్లి మంజేష్ ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన నామినేషన్ల ప్రక్రియ అనంతరం ఒక్కొక్క పోస్టుకు ఒక్కో అభ్యర్థి నామినేషన్ దాఖలు పరచగా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు మొత్తం 9 మంది ఎన్నిక అయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ ఎన్నికలలో జోన్ 3 పరిధిలో నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక పూర్తయ్యింది. అధ్యక్షుడు వి బాలకృష్ణ, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, మంగళగిరి, గుంటూరు జిల్లా, ప్రధాన కార్యదర్శి కె జయ ప్రకాశ్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, డిటిసి ఆఫీస్, ఒంగోలు, ట్రెజరర్ కె కరుణాకరన్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, కావలి, నెల్లూరు జిల్లా. డిస్ట్రిక్ట్ రెప్రజెంటేటివ్ 6 పోస్టులు ఏకగ్రీవమయ్యాయన్నారు. గుంటూరు జిల్లా జి అమృత రాణి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, తెనాలి. పల్నాడు జిల్లా సీహెచ్ మనీషా, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, నరసరావుపేట. బాపట్ల జిల్లా కె రవి నాయక్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, చీరాల. ప్రకాశం జిల్లా బి భాను ప్రకాష్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, డిటిసి ఆఫీస్, ప్రకాశం. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఏ మల్లికార్జున్‌రెడ్డి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, డిటిసి ఆఫీస్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా. మార్కాపురం జిల్లా కెవెల్ రావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, డీటీవో ఆఫీసు మార్కాపురం జిల్లా ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. సహాయ ఎన్నికల అధికారిగా ఒంగోలు తాలూకా కార్యదర్శి మక్దూం షరీఫ్, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కామ్రేడ్ బి కృష్ణ కిషోర్ లు వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జోన్ 3 పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొని నూతనంగా ఎన్నికయిన జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను అభినందించారు.

# సీఎం సహాయనిధి పేదల పాలిటీ వరం




### మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మార్చి 15)

సిఎం సహాయనిధి పేదల పాలిట వరమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మార్కాపురం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం 68 ఎల్‌వోసీలతో కలిపి మొత్తంగా రూ.68,28,620ల సీఎం సహాయ నిధి నుండి విడుదలైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మార్కాపురం మండలం నుంచి 9 మందికి రూ.8,66,007లు, కొనకనమిట్ల మండలం నుంచి 16 మందికి రూ.9,81,368లు, తర్లుపాడు మండలం నుంచి 9 మందికి రూ.3,62,261లు, పొదిలి టౌన్ నుంచి 9 మందికి రూ.5,54,690లు, మార్కాపురం టౌన్ నుంచి 10 మందికి రూ.4,41,73లు, పొదిలి మండలం నుంచి 12 మందికి రూ.6,07,200ల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.






# మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు

# పేదలందరికీ మేలు జరుగుతుంది

## ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మార్చి 15)

ప్రజలు కేంద్ర రాష్ట్రాల్లో మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా పేదలకు మేలు జరుగుతుందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని హనుమాన్ నగర్ 14వ లైన్‌లో పీఎం ఉజ్వల పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు, సిలిండర్లను కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందజేశారు.

ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పేద మహిళల కష్టాలను తగ్గించడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఉజ్వల పథకం ఎంతో మందికి మేలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని, దీంతో పేదలందరికీ మేలు జరుగుతుందని అన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో ధరలు పెంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని ఆయన విమర్శించారు. సహజ వనరులను కూడా దోచుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం



అధికారంలోకి వచ్చిన తరువాత సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తూ పేదల జీవితాల్లో మార్పులు తీసుకువస్తోందన్నారు. "తల్లికి వందనం" పథకం ద్వారా ప్రతి కుటుంబంలో చదువుకునే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. అలాగే పెన్షన్ల పెంపు ఘనత కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని పేర్కొన్నారు. ఒకవైపు అమరావతి రాజధాని అభివృద్ధి, మరోవైపు పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కొనసాగిస్తూనే అప్పుల భారంలోనూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని జీవీ అన్నారు. గ్యాస్ సిలిండర్లు అందుకున్న లబ్ధిదారులు ఈ సందర్భంగా ప్రభుత్వానికి, చీఫ్ విప్ జీవి ఆంజనేయులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# బద్వేలు, ఉమ్మడి కడప జిల్లా సంఘంగా ఏర్పడి

# సామాజికవర్గ అభివృద్ధికి తోడ్పడుదాం

## కాకతీయ సేవా రాష్ట్ర సమాఖ్య ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మార్చి 15)

సామాజిక వర్గంలోని పేదల అభివృద్ధి కోసం సంఘంగా ఏర్పడి సేవ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకటరావు చెప్పారు. ఆదివారం బద్వేలు ప్రాంత కమ్మ సోదర సోదరీమణుల ఆత్మీయ సమావేశం పోరుమామిళ్ల రోడ్డులోని సాయి ఫంక్షన్ హాల్ లో పెద్దినేని కొండయ్య నాయుడు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మన సంఘాల ద్వారా గత సంవత్సరం సుమారు 7 కోట్ల పైన పేద పిల్లలకు స్కాలర్షిప్ల రూపంలో ఇచ్చిన చరిత్ర మనదేనని దానిలో 25% మిగిలిన సామాజిక వర్గ పిల్లలకు కూడా ఇచ్చామని చెప్పారు. అలాగే వ్యవసాయ సదస్సులు, బ్లడ్ డొనేషన్ క్యాంపులు విరివిగా చేశామన్నారు. రాష్ట్ర సమాఖ్య ఆధ్వర్యంలో ఎక్కడైతే సంఘాలు లేవో ఆయా ప్రాంతాలలో అందరినీ ఒకచోటకు చేర్చి సంఘంగా ఏర్పాటు చేస్తూ సేవా కార్యక్రమాల వైపు మళ్ళిస్తున్నామని చెప్పారు. మనమంతా సమిష్టిగా ఉంటేనే ఒకరికి ఒకరు సహకరించుకుంటూ అభివృద్ధి చెందొచ్చని ప్రత్యేకంగా పేద పిల్లల విద్యపై ప్రత్యేకమైన దృష్టి పెట్టి మన సంఘాలన్నీ పనిచేస్తున్నాయన్నారు. బద్వేలు నియోజకవర్గానికి నూతన కమిటీ అధ్యక్షులుగా పోరుమామిళ్ళకు చెందిన గుర్రం పుల్లప నాయుడు, కార్యదర్శిగా పెద్దినేని కొండయ్య నాయుడు లను 9 మందితో ఏకగ్రీవంగా కమిటీ ఎంపిక చేశారు. త్వరలో ఒక సమావేశం పెట్టుకొని ముందుకు వెళదామని నిర్ణయించారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాఖ్య కార్యదర్శులు వెలగా కోటేశ్వరరావు, తమ్మినేని రమేష్, సంయుక్త కార్యదర్శి పర్చూరు శ్రీనివాసరావు, ప్రకాశం జిల్లా సమాఖ్య సభ్యులు ముప్పవరపు వెంకట్రావు, బ్రహ్మం గారి మఠం కమ్మ సంఘం అధ్యక్షులు గద్దె కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీగిరిలో బాలవిహార్ శిక్షణా తరగతులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 15)

ఆదివారం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్త నిర్వహణలో శ్రీగిరి గో క్షేత్ర భవన్‌లో ఏర్పాటైన శ్రీగిరి బాలవిహార్ శిక్షణా తరగతులలో పలువురు విద్యార్థులు హనుమాన్ చాలీసా,గోవింద నామాలను అప్పగించడంతో పాటు అంత్యాక్షరి, చిత్ర లేఖనం ఊహాశక్తిని ఉపయోగించి స్వంతంగా కథలను చెప్పడం, పాటలు పాడడం వంటి అంశాలలో తమదైన ప్రతిభను చాటి చెప్పారు. బాల విహార్ శిక్షణా తరగతులు విద్యార్థులలోని బహుముఖ నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని మరింతగా సద్వినియోగం చేసుకోవాలని శ్రీగిరి ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి కోరారు.


**భక్తిశ్రద్ధలతో శ్రీవారి ఆస్థానం:** శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవారి ఉత్సవమూర్తులను చక్కగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. చతుర్వేద పారాయణతో పాటు రామాయణ భారత భాగవత భగవద్గీత గ్రంథాలలోని శ్లోకాలను, పద్యాలను గానం చేశారు. ప్రముఖ గాయని ఫణి దీప్తి అన్నమయ్య సంకీర్తనలను హృద్యంగా గానం చేశారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సివి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి, శ్రీగిరి దేవస్థానం అర్చకులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.






# ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి సత్కారం






(షణ్ముఖ వెలుగు, పోరుమామిళ్ళ, మార్చి 15)

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రచార విభాగం సంయుక్త కార్యదర్శిగా చాపాటి లక్ష్మీనారాయణరెడ్డి నియమితులైన సందర్భంగా పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి గజమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం చాపాటి లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ తనకు ఈ కీలక బాధ్యత లభించడంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించిందని తెలిపారు. పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తూ కార్యకర్తలకు దారిదీపంగా నిలుస్తున్న ఆయన నాయకత్వం తమకు ఎల్లప్పుడూ ప్రేరణనిస్తుందని కొనియాడారు. ఇకపై కూడా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆశీస్సులు, మార్గదర్శకత్వంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తానని, పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ సుధమ్మ, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ప్రచార కార్యక్రమాలను మరింత బలంగా ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ రాజశేఖర్, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర మరియు జిల్లా అనుబంధ విభాగాల నాయకులు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, రాజీవ్ భాష, చిత్తా గిరి ప్రణీత్ రెడ్డి, కాశి నాయన మండల పార్టీ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, తులసి సురేష్, చిత్తా రాజశేఖర్ రెడ్డి, సిద్ధమూర్తి రాజారెడ్డి, నాగ సుబ్బారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీలు మహబూబ్ పీర, ఇషాక్, ముత్తుజ, గురప్ప, ఫార్టీ సీనియర్ నాయకులు శ్రీరాములు, ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మాలకొండయ్య, హరికృష్ణ, పెసల గణేష్, శివ, సుబ్రహ్మణ, రామలక్ష్మణ్ రెడ్డి, చాపాటి సాయి నారాయణరెడ్డి, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శిద్దా తన్మయి కి అవార్డు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 15)

మార్చి 15వ తేదీ ఆదివారం గుంటూరులోని విజయమ్ కన్వెన్షన్‌లో బిఎన్ఐ నిర్వహించిన సిగ్నేచర్ ఉమెన్ అవార్డ్స్ 2026 కార్యక్రమంలో భాగంగా ఒంగోలు నుండి శిద్దా తన్మయి అవార్డు అందుకున్నారు. గత 16 నెలలుగా తల్లిదండ్రుల సహకారం, ప్రోత్సాహంతో ఈవెంట్స్ నిర్వహిస్తూ, గత 6 నెలలుగా బోటిక్‌ను కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నారు. బిఎన్ఐ గుంటూరు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి టాప్ ఎంట్రప్రెన్యూర్స్‌ను ఎంపిక చేయగా, అందులో శిద్దా తన్మయి అవార్డు అందుకోవడానికి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. అలాగే తనకు వచ్చిన ఈ అవార్డును తన తల్లిదండ్రులకు అంకితం చేస్తున్నానని చెప్పారు. వారి సహకారం వల్లే ఈ స్థాయికి చేరుకోగలిగానని ఆమె పేర్కొన్నారు. తనను ఎంపిక చేసిన బిఎన్ఐ గుంటూరు సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే తన వ్యాపారానికి మద్దతు ఇచ్చిన ప్రతి కస్టమర్‌కు కూడా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా మద్దతు ఇస్తూ తమను మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య మహిళా ఎంట్రప్రెన్యూర్స్‌లో ఒకరిగా ఉండటం తనకు చాలా ఆనందంగా ఉందని తెలిపారు.

## బద్వేల్‌లో బీజేపీ మండల ప్రశిక్షణ కార్యక్రమం





**(షణ్ముఖ వెలుగు, గోపవరం, మార్చి 15)**

బద్వేల్ రూరల్ మండలంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ మండల ప్రశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. పార్టీ కార్యకర్తలకు పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత నిర్మాణం మరియు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్టి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు గజ్జల రామకృష్ణారెడ్డి, తిప్పలూరు రామ సుబ్బారెడ్డి, మాచునూరు సుబ్బరాయుడు ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. వారు బీజేపీ పార్టీ ఆవిర్భావం, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలు, పార్టీ సిద్ధాంతాలు, అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి కార్యకర్తలకు విపులంగా వివరించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు అన్నపురెడ్డి అశోక్ కుమార్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి బొమ్మన విజయ్, బద్వేల్ రూరల్ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఇతర సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

## పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్ఐ రాజేష్



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 15)**

పొదిలిల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాల ఏర్పాట్లను మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు సీఐ రాజేష్‌కుమార్ సూచనలతో ఎస్ఐ రాజేష్ ఆదివారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో వసతులను, పరీక్ష ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్‌ను విధించినట్లు ఆయన తెలిపారు. సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసి వేయాలని ఆదేశించారు.

# ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దురాక్రమణను వ్యతిరేకించండి

## కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అమెరికా లొంగుబాటును నిరసించండి

**(షణ్ముఖ వెలుగు, కొండేపి, మార్చి 15)**

కొండేపి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కేజీ మస్తాన్ మాట్లాడుతూ ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ అత్యంత పాసవిక దాడి చేస్తున్నాయి. అకస్మాత్తుగా ఫిబ్రవరి 28న ఇరాన్ రాజధాని టేహ్రాన్ సహా అనేక నగరాల పై బాంబుల వర్షం కురిపించాయి. ఇరాన్ సుప్రీమ్ నేతలతో పాటు ఆ దేశానికి చెందిన 40 మంది పాలనా అధికార యంత్రాంగంలోని కీలక వ్యక్తులను తొలి రోజే హత్య చేశాయి. అత్యంత కిరాతకంగా పాఠశాల పై బాంబులు వేయటం వలన 193 మంది విద్యార్థులు పిల్లల ప్రాణాలు కోల్పోయారు. 180 మంది ఇరాన్ సైనికుల పడవను అమెరికా నీట ముంచింది. అమెరికా ఇజ్రాయిల్ నరమేధంలో 1700 మంది చనిపోయినట్లు రెడ్ క్రాస్ సంస్థ సర్వే చెప్తా ఉంది. ఈ యుద్ధం కేవలం ఇరాన్‌లో ఉత్పత్తి అవుతున్న ఆయిల్ మీద పెత్తనం కొనసాగించడం కోసం అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు యుద్ధాలు చేస్తున్నాయి. ఈ యుద్ధం దేశానికి ఆర్థికంగా నష్టం జరుగుతుందని మేధావులు ప్రకటన చేశారు. ఈ యుద్ధం ప్రపంచానికి పెద్ద ప్రమాదం కనుక అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్ పై యుద్ధాన్ని తక్షణమే ఆపివేయాలని, ప్రపంచ శాంతిని నెలగొల్పాలని సిపిఎం కోరుతుందన్నారు. దీని ప్రభావంతో భారతదేశంలో ఉన్న గ్యాస్ రేట్లు ఈ పాటికే రూ.60లు పెంచి పేద ప్రజలపై యుద్ధ భారం మోపటం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మన రాష్ట్రంలో ఉన్న ఎన్డీఏ కూటమి వైసీపీ, కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ప్రకటించడం దురదృష్టకరమని



ఆయన అన్నారు భారత ప్రధాని మోడీని ట్రంపు రష్యా నుండి ఆయిల్ నెల రోజులు మాత్రమే కొనుగోలు చేయండి అంటే బిజెపి ప్రభుత్వం ప్రధాని మోడీ బసవన్నలా తల ఊపటం బాధాకరం అన్నారు. ఆనాడు గాడ్సే బ్రిటిష్ వాళ్లకు లొంగిపోయాడు. ఈనాడు ప్రధాని మోడీ అమెరికాకు తొత్తుగా వ్యవహరించటం భారత ప్రజలను అవమానించుటమే అన్నారు. రాష్ట్రంలో ఉన్న తెలుగుదేశం, జనసేన, వైసిపి ప్రధాన పార్టీలు దీనిని ఖండించాలని తాము కోరుకుంటున్నామన్నారు. భారత ప్రజానీకం పై అధిక ధరలు, భారాలు మోపటం సరైన విధానం కాదని ఆయన అన్నారు. యుద్ధం మాకొద్దు ప్రపంచ శాంతి కావాలని భారత ప్రజానీకం కోరుకుంటా ఉన్నారన్నారు. రైతులను దివాళి తీసే ఒప్పందాలు పూర్తిగా రద్దు చేసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ కొండేపి మండల శాఖ కార్యదర్శి వై రూబెన్, వై నరసింహా, వెంకట్‌రెడ్డి, తదిరులు పాల్గొన్నారు.

# శివశక్తి ఫౌండేషన్ సేవలు అభినందనీయం

### నారా భువనేశ్వరి

### ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లీలావతికి ఘన సత్కారం

### హైదరాబాదులోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఘనంగా 29వ వార్షికోత్సవ వేడుకలు



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మార్చి 15)**

పేదలకు సాయం చేయడం, జన్మభూమి రుణం తీర్చుకోవడమే లక్ష్యంగా నిస్వార్ధంగా సేవలందిస్తున్న శివశక్తి ఫౌండే లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి కొనియాడారు. హైదరాబాదులోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో 29వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శివశక్తి ఫౌండేషన్ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతి ఏటా స్టేట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలవడం, ఉచిత కళ్ళజోళ్ళు పంపిణీ కంటి ఆపరేషన్లు, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లతో పాటు ఎంతోమంది పేదలకు బాసటగా నిలుస్తున్న శివశక్తి ఫౌండేషన్ ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి చేతుల మీదుగా శివశక్తి ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి అవార్డు అందుకున్నారు. లీలావతిని నారా భువనేశ్వరి మెమొంటో, శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఎన్టీఆర్ ఆశయ సాధన లక్ష్యంగా పనిచేస్తున్న జీవి ఆంజనేయులు, లీలావతి దంపతులను నారా భువనేశ్వరి సందర్భంగా అభినందించారు.

# ఇఫ్తార్ విందు ఏర్పాట్ల పై ఎమ్మెల్యే కందుల చర్చ



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మార్చి 15)**

మార్కాపురం జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేయనున్న ఇఫ్తార్ విందుకు సంబంధించి ఏర్పాట్లు గురించి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో డిఎండబ్ల్యు అధికారి పార్థసారథితో తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం చర్చించారు. ఈ కార్యక్రమంలో ముస్లింమైనార్టీ సెల్ ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, డాక్టర్ మౌలాలి, ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో వైఎస్ఆర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వంకెల పెద్ద పోలిరెడ్డి

**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మార్చి 15)**



పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులు ఉపవాస దినాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం సిద్ధవటం రోడ్డు లోని పెద్ద మసీద్ ఆత్మ మసీదులో ముస్లిం సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందును వైఎస్ఆర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వంకెల పెద్ద పోలిరెడ్డి ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులు కమిటీ సభ్యులు వారికి సాధర్వంగా ఆహ్వానించి సత్కరించారు. అనంతరం పలువురు ముస్లింల పెద్దలతో కలిసి వారు ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంకెల పెద్ద పోలిరెడ్డి మాట్లాడుతూ అల్లా దయ ఉపవాసాలు చేస్తున్న ప్రతి ముస్లిం సోదరులు అందరికీ మంచి జరగాలని వారు ఆకాంక్షించారు. అనంతరం ఫాతిమా మసీద్ ప్రాంగణంలో పలువురికి ఇఫ్తార్ విందును వారి చేతుల మీదుగా వడ్డించి ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు పలువురికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మాజీ స్టేట్ డైరెక్టర్ షేక్ అల్లా బకాస్, వైఎస్ఆర్సిపి యువజన విభాగం నియోజకవర్గ మాజీ అధ్యక్షులు కామిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ హాసన్, మాజీ స్టేట్ డైరెక్టర్ షేక్ మహబూబ్ బాషా (బిగ్ బాస్), వైసీపీ సీనియర్ నాయకులు షేక్ కరీముల్లా, నూరుల్లా భాష హసన్, సర్పంచి జయరామిరెడ్డి, భూమిరెడ్డి ఓబుల్‌రెడ్డి, బాబ్జి, ఉమా ట్రావెల్స్ మహబూబ్ బాషా, రసూల్, పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com